పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పీవీ సిద్ధారెడ్డి


ధర్మవరం: ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


నల్లచెరువు: గాజేఖాన్ పల్లిలో ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి

ధర్మవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తూ నవరత్నాల్లోని పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 39వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వార్డులో ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించారు. పలువురు వార్డు ప్రజలు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. తొలి విడుతగా వార్డులో డ్రైన్‌లు నిర్మించడం జరుగుతుందని ఆ తర్వాత సీసీరోడ్లు వేయిస్తామని తెలిపారు. అలానే వార్డులో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని పలువురు విన్నవించారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన పేదలందరికీ పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇప్పటికే ఒక్క ధర్మవరం పట్టణంలోనే 12 వేలకు పైగా ఇంటి స్థలాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ కడప రంగస్వామి, నాయకులు కడప ఈశ్వర రంగ, కడప వాసుదేవుడు, గోవిందాచారి, ముక్కర శ్రీన, పూజారి వెంకటరాముడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి తెలిపారు. నల్లచెరువు సచివాలయం-1 పరిధిలోని రాగన్నగారి పల్లి, గాజేఖాన్ పల్లి, నల్లచెరువు క్వాటర్స్‌లలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి ప్రతి కుటుంబానికి ఎంత మేరకు లబ్ధి చేకూరిందో వివరించి, బుక్‌లెట్లను అందజేశారు. పరిష్కారం నోచుకోని ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలన్నారు. గ్రామంలో సిమెంట్ కాంక్రీటు రోడ్డు వేయాలని పలువురు కోరారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే.. రోడ్డుకు సంబంధించిన ఎస్టిమేట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అసైన్మెంట్ కమిటీ ద్వారా పొజిషన్‌లో ఉన్న వారికి పట్టాలు ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. తహసీల్దార్ మధునాయక్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే.. అర్హత కలిగిన వారికి పట్టాలిచ్చేలా చూడాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరుగుతున్న తీరును, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు చూపుతున్న ఆదరణను చూసి ఓర్వలేని చంద్రబాబు నాయుడు ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. చంద్రబాబు కుట్రలను ప్రజలే తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సర్పంచ్ పంచరత్నమ్మ, శ్రీనాథ్‌రెడ్డి, యూసుఫ్, ఎంపీటీసీలు సుమియా, భాస్కర్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, డైరెక్టర్ ఆదిమూర్తి, టెంపుల్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు నరసింహా రెడ్డి, రవికుమార్ రెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముస్తఫా, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్, నాయకులు డాక్టర్ శంకర్, బట్టీ హైదర్ వలి, చెరువు నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, నారాయణప్ప యాదవ్, రఫి, వి.నారాయణప్ప, నజీర్, లక్ష్మి నారాయణరెడ్డి, డీలర్ జయచంద్రారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, మహేంద్రరెడ్డి, డీజే ఈశ్వర్‌రెడ్డి, డీఎస్, ఆంజనేయులు, వంశీకృష్ణ, ఖాదర్ బాషా, మధుబాబు, త్రిలోక్, జనార్దన్, సూర్య నారాయణరెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హులందరికీ పథకాలు అందించాలి


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పోలప్ప

ఓడీ చెరువు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే గ్రామ సచివాలయ వ్యవస్థ లక్ష్యమని ఎంపీడీఓ పోలప్ప అన్నారు. మండలంలోని మిట్టపల్లి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాల ప్రదర్శనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. వలంటీర్ల ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


ఆమిదాలకుంటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ శివారెడ్డి

చెన్నేకొత్తపల్లి: సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని ఓబుళంపల్లి, వెంకటంపల్లి సచివాలయంతో పాటు ఆమిదాలకుంట, నాగిసెట్టిపల్లి, అంగన్‌వడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఓబుళంపల్లి గ్రామ సచివాలయంలో విధులకు అలస్యంగా వచ్చిన సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగుల సమయపాలన, డ్రెస్ కోడ్‌తోపాటు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గంగాభవాని తిరునాల ప్రారంభం


పూజల్లో పాల్గొన్న మహిళలు

గాండ్లపెంట: స్థానిక గంగాభవాని మాత 15వ వార్షిక తిరునాల శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ అనంతరం కలశపూజ, అభిషేకాలు లలిత సహస్రనామాలు, కుంకుమార్చన చేశారు. రాత్రి 9 గంటలకు కత్తివారిపల్లి భజన బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తిరునాలలో భాగంగా రెండో రోజు శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అమ్మవారి పంచలోహ విగ్రహం ఊరేగింపు, రాత్రికి పాటల కచేరి కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ముఖద్వారం ఏర్పాటుకు సన్నాహాలు


ముఖద్వారం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, అధికారులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద ఏర్పాటు అవుతున్న జగనన్న కాలనీలో ముఖ ద్వారం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎంపీపీ ఏవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. కాలనీకి ముఖ ద్వారం రోడ్డుకు దూరంగా ఉండాలని.. నాలుగు లైన్ల రహదారి వస్తుందని సూచించారు. 20 అడుగుల వెడల్పుతో రోడ్డుకు ఇరువైపులా ఆర్చి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 20 అడుగుల ఎత్తు ఉంటుందని, ఈ కొలతలు తీసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఏఈ శశి, సిబ్బంది చెన్నకేశవులు, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీతో వేరుశనగ పంపిణీ


విత్తన శుద్ధి కేంద్రంలో వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు


సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసుకునే రైతులకు త్వరలో 40 శాతం రాయితీతో విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎ.రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గొట్లూరు ఆర్‌బీకే కేంద్రంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలను సాగు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి అందే రాయితీలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి పద్మావతి, జిల్లా ఉప వ్యవసాయ సంచాలకులు విద్యావతి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాలగుండ్లపల్లి కేశవరెడ్డి, సర్పంచ్ పిట్టా నరసమ్మ, ఎంపీపీ గిరక రమాదేవి, సహాయ సంచాలకులు జి.క్రిష్టయ్య, వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు చెందిన అధికారులు, రైతు భరోసా కేంద్రం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన కాయలు అందిస్తాం

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేసుకునే రైతులకు సబ్సిడీ ధరతో నాణ్యమైన వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బరావు తెలిపారు. శుక్రవారం ధర్మవరంలోని వేరుశనగ విత్తన కాయల శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విత్తన నాణ్యతపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, ఏడీఏ క్రిష్టయ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మాలగుండ్లపల్లి కేశవరెడ్డి, వ్యవసాయాధికారి చెన్నవీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.6.50 లక్షలతో రోడ్డు పనులు


బత్తినవారిపల్లి వద్ద మట్టి రోడ్డు పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజినేయులు

ఓడీ చెరువు: మండలంలోని బత్తినవారిపల్లి నుంచి నల్లమాడ మండల బార్డర్ వరకు ఉపాధిహామీ పథకం కింద జరుగుతున్న మట్టి రోడ్డు పనులను శుక్రవారం ఏపీడీ శ్రీనివాసరెడ్డితో కలసి డ్వామా పీడీ రామాంజినేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల కోరిక మేరకు రెండు కిలోమీటర్ల మేర పొలాల్లో నుంచి నల్లమాడ బార్డర్ వరకు రూ.6.50 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. పూర్తిగా కూలీలతోనే రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సోముశేఖర్‌రెడ్డి,ఈసీ ఆంజనేయులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి


నీటి తొట్టెలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం

తాడిమర్రి: పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు గ్రామస్తులకు సూచించారు. మండల కేంద్రం, పెద్దకోట్ల, కునుకుంట్ల, దాడితోట, పిన్నదరి, ఎం.అగ్రహారం, చిల్లవారిపల్లి, నార్సింపల్లి తదితర గ్రామంలో శుక్రవారం వారు దోమల నివారణకు చర్యలు చేపట్టారు. యాంటిలార్వా పిచికారీ చేయించారు. మురుగు నీటి గుంతలను గుర్తించి పైరేత్రియం పిచికారీ చేయించారు. నీటి తొట్లల్లోని నీటిని పారబోయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

వినాయక ఆలయం ప్రారంభోత్సవం

తాడిమర్రి: మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద నిర్మించిన వినాయక ఆలయాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. స్థానిక కాశిరెడ్డి నాయన ఆశ్రమం ఆవరణలో ఆరు నెలల క్రితం ఆలయాలన్ని నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అయితే అనివార్య కారణాల వల్ల ఆలయం పూజలకు నోచుకోకుండా మూసి వేశారు. తిరిగి శుక్రవారం ఆలయానికి మామిడి తోరణాలు, కొబ్బరి పట్టలు కట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి

తనకల్లు: మండల పరిధిలోని రాకుంటపల్లిలో శుక్రవారం నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డికి ఆలయ అర్చకులు వేదామంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూలమాలలతో సత్కరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆలయంలో విగ్రహ ప్రతిష్టను కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్రబాబు, ఎంపీటీసీ ఈశ్వరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసుల నాయుడు, దుశ్యాని నీలకంఠారెడ్డి, రామమోహన్ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం


విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆదినారాయణ

ఎన్పీకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీఓ ఆదినారాయణ పేర్కొన్నారు. 'జగనన్న విద్యా కానుక' పథకంలో భాగంగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్న విద్యా కానుక కిట్లను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి గాను జూన్ 12న పాఠశాల ప్రారంభమయ్యే రోజునే ప్రతి విద్యార్థికి విద్యా కానుక (పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, స్కూల్ బ్యాగ్, షూ, యూనిఫాం, టై, బెల్టు, డిక్షనరీ) కిట్లను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే మండలానికి 1 నుంచి 5, 8, 10వ తరగతికి సంబంధించి 11,840 పాఠ్యపుస్తకాలు, 2,217 బెల్టులు, 388 డిక్షనరీలు వచ్చాయన్నారు. మరో నాలుగు రోజుల్లో మిగిలిన వస్తువులు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది ఈశ్వర్‌రెడ్డి, బషీర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా భూ రికార్డుల సర్వే అధికారి రామకృష్ణ

ఓడీ చెరువు: ఓడీ చెరువు, కొండకమర్ల గ్రామాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం జిల్లా భూరికార్డుల సర్వే అధికారి, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల నిర్వహణ ప్రత్యేక అధికారి రామకృష్ణ సందర్శించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. సెంటర్లలో ఉన్న ఫుడ్ స్టాక్‌ను చెక్ చేశారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ, పాఠశాలల నిర్వహణలో వర్కర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కొండకమర్ల అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు ఎల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పకుండా అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధలన ప్రకారం ఎవరైనా పాఠశాల నిర్వహించకుంటే ఆయా అంగన్‌వాడీ వర్కర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్ఐ వినోద్‌కుమార్‌రెడి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడు జ్యోతిప్రసాద్‌పై కేసు నమోదు

నల్లమాడ: పుట్టపర్తికి చెందిన బీజేపీ నాయకుడు జ్యోతిప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ గోపి తెలిపారు. నల్లసింగయ్య గారిపల్లికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకుడు చాంద్‌బాషా భార్య తమ్ముడైన బాబ్‌జాన్ పుట్టపర్తికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డితో కలిసి బాబ్‌జాన్ తీయించుకున్న ఫొటోను జ్యోతిప్రసాద్ తన ఫేస్‌బుక్ అకౌంట్, వాట్సాప్‌లో పోస్టు చేశారు. వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రతిష్టకు ఉద్దేశపూర్వకంగా భంగం కలిగించారు. జ్యోతిప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డుండట డుంగావత్ కుళ్లాయినాయక్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు జ్యోతిప్రసాద్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

డ్రిప్ పరికరాలపై అవగాహన

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం, ఏటిగడ్డతండా గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వం రాయితీతో అందించిన బిందు సేద్య పరికరాల పనితీరుపై ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో డ్రిప్ మంజూరైన రైతుల పొలాలను సందర్శించారు. డ్రిప్‌ను శుభ్రపరచుకోవడం, వాటర్ మేనేజ్‌మెంట్‌పై వివరించారు. కార్యక్రమంలో పట్నం సర్పంచ్ చలపతినాయక్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలుకు మరమ్మతులు

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్ధారెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ శాంతాబాయి ద్వారా కమ్యూనిటీ హాలుకు రూ.3 లక్షల సొంత నిధులు వెచ్చించి ప్రహరీ నిర్మాణం, పెయింటింగ్స్ వేయించారు. అంగన్వాడీ కేంద్రంలోకి వచ్చే చిన్నారుల సౌకర్యార్థం పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

పుట్టపర్తి అర్బన్: ఇటీవల ప్రమాదవశాత్తూ హార్వెస్టర్ వాహనం కిందపడి మృతి చెందిన పుట్టపర్తి మండలం మార్లపల్లికి చెందిన గొర్ల సూర్యనారాయణ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేశారు. మిగిలిన మొత్తం ఖాతాలో జమ అవుతాయని అధికారులు తెలిపారు. శుక్రవారం కొట్లపల్లి సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఎంపీడీఓ అశోక్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ కుళ్లాయి రెడ్డి, సెక్రెటరీ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శేషాద్రిరెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సేవ చేయడంలోనే ఆనందం

ధర్మవరం రూరల్: రోగులకు సేవ చేయడంలోనే ఆనందం వుందని మెడికల్ సూపరిండెంట్ పద్మలత అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో నర్సులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవా నిరతిని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నజీర్, మధుసూధన్, ఇందులేఖ, మాధవ్, ఏఓ ఉదయ్ భాస్కర్, ఎస్ఓ సంపత్‌కుమార్, నాగార్జున, వెంకటరమణ, హెడ్ నర్సులు పూర్ణచంద్ర, మేరీ సరళ, నిర్మల, లత, కళ్యాణి, విజయలక్ష్మి, జయశ్రీ, రజియా, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

రామగిరి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రామగిరి సర్పంచ్ మీనుగ నాగరాజు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రామగిరి సచివాలయంలో జిల్లా డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి, పెనుకొండ ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులరెడ్డి ఆదేశాల మేరకు పర్యావరణ, జీవనశైలిపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నరేంద్రశర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలుకా కార్యవర్గం ఎన్నిక

కదిరి టౌన్: స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా కె.బాబాఫకృద్దీన్, టి.వేమారెడ్డి వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా ఆత్మారెడ్డి, అధ్యక్షుడిగా జి.ఫకృద్దీన్, కార్యదర్శిగా నాగమణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డి.రామాంజులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.హరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా పి.వలసదేవి, వై.రామచంద్రారెడ్డి, దేవలానాయక్, జాయింట్ సెక్రటరీలుగా కె.రామాంజులు, రఫీమన్నీసా, ఉపేంద్రరెడ్డి, బాబావలి, హేమలత, రామ్‌ప్రసాద్, గోపినాయక్, కోశాధికారిగా చిన్నయ్యశెట్టి ఎంపికయ్యారు.

పరామర్శ


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి

నల్లమాడ: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు తల్లి పొరకల అశ్వర్థమ్మ (75) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అశ్వర్థమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, నాయకులు షంషీర్, ఈశ్వరయ్య తదితరులు నివాళులర్పించారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలోని పాముదుర్తికి చెందిన నాగరాజు (34) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతుడికి నివాళి అర్పించారు. అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షురాలు సుజాత రాజగోపాల్, చిరంజీవి, ఫొటో శీన, మల్లేసు, లక్ష్మీనారాయణ, బొజ్జప్ప, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్రంలో మెలకువలు నేర్చుకోవాలి


గణితశాస్త్రంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

కనగానపల్లి: గణిత శాస్త్రంలో పట్టుసాధించాలంటే విద్యార్థులు మెలకువలు నేర్చుకోవాలని ఉపాధ్యాయుడు నాగముని తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు వేదిక్ గణితంపై అవగాహన కల్పించారు. గణిత శాస్త్రంలో ప్రాథమిక భావనలు, సూత్రాలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం యోగా గురువు సుబ్బరాయుడు తెలుగు భాష, ఇతిహాసాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గోవిందు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు గృహ నిర్మాణాలకు భూమిపూజ

గాండ్లపెంట: మండల కేంద్రంలోని కదిరి-రాయచోటి ప్రధాన రహదారికి సమీపంలోని జగనన్న లే అవుట్‌లో శనివారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో గృహ నిర్మాణాలకు భూమి పూజ చేయనున్నట్లు హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

